

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బోనాల రవి, కార్యదర్శిగా సూర తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ సత్యనారాయణ, కోశాధికారిగా హసీనాబేగం, ఉపాధ్యక్షులుగా ఎస్ సత్యనారాయణ, రజిత, జయకుసుమాకర్‌రావు, రేవ, సంయుక్త కార్యదర్శులుగా రవీందర్, జి రాజశేఖర్, ఈ శ్రీదేవి, విజయలక్ష్మి, కార్యాలయం కార్యదర్శిగా బి కృపవరం, స్పోర్ట్స్ కార్యదర్శిగా కిషన్, సభ్యులు ఎన్నుకున్నారు.

కొత్తపల్లి మున్సిపాలిటీ, విలీన గ్రామాలకు

'ప్రత్యేక' అధికారులు

- వార్డు కార్యాలయాలుగా పంచాయతీ భవనాలు
- రికార్డుల స్వాధీనం, ఆస్తులు సీజ్




దుర్శేడ్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నగరపాలక సంస్థ బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

కరీంనగర్ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో కొత్తగా విలీనం చేసిన కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు ఐదు విలీన గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకాధికారులను నియమించారు. రికార్డులను స్వాధీనం చేసుకొని ఆయా ప్రాంతాల పరిపాలన, వ్యవహారాల బాధ్యతలను అప్పగించారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అదనపు అధికారులుగా డీఈ లచ్చిరెడ్డి, ఏఈ శిరీషా, టీపీఎస్ రాజ్‌కుమార్‌ను నియమించారు. చింతకుంట గ్రామానికి ప్రత్యేకాధికారిగా అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, అదనపు ఆఫీసర్లుగా ఏఈ సతీష్, ఏసీ వెంకటేశ్, ఆర్‌ఐ సంపత్, టీపీఎస్ తేజస్వినిని నియమించారు. మల్కాపూర్ గ్రామానికి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ ప్రత్యేకాధికారిగా, డీఈ శ్రీనివాస్, టీపీఎస్ తేజస్విని, సీనియర్ అసిస్టెంట్ నిఖిత, బొమ్మకల్‌కు ఏసీపీ టి వేణు, డీఈ ఓంప్రకాశ్, జేఏవో లక్ష్మీరాజం, ఆర్‌ఐ కిష్టయ్యను నియమించారు. దుర్శేడ్ ప్రత్యేకాధికారిగా సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్, అదనపు అధికారులుగా డీఈ అయూబ్‌ఖాన్, టీపీఎస్ సంధ్యను నియమించారు. పంచాయతీ, మున్సిపాలిటీ మినట్స్ పుస్తకాలతోపాటు రికార్డులను స్వాధీనం చేసుకొని నగరపాలక సంస్థ పేరుతో కొత్త బ్యాంకు ఖాతాను తెరవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ భవనాల బోర్డులను మార్చివేసి మున్సిపల్ వార్డు కార్యాలయంగా పేరు మార్చాలని, పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సేకరించిన స్థిర, చర ఆస్తులు, డిపాజిట్లు, పెట్టుబడులు ప్రకటించి బదిలీ చేసుకోవడం, పన్నులు, పన్నులేతర పద్దులను పరిశీలించాలని సూచించారు. పంచాయతీల్లో కొనసాగుతున్న పథకాల వివరాలను సేకరించాలని, చెల్లించాల్సిన పన్నులు, బిల్లుల వివరాలు, మూడేళ్లుగా జారీ చేసిన భవన అనుమతులు, లే అవుట్ వివరాలు సేకరించి భద్రపరచాలని ఆదేశించారు. ఒక్క రికార్డు తప్పి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఎలాంటి చెల్లింపులు చేయవద్దని, ఏమైనా చెల్లించాల్సి ఉంటే కార్పొరేషన్ చూసుకుంటుందని చెప్పారు. అన్ని వివరాలను, రికార్డులను ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మా ప్రకారం నగరపాలక సంస్థకు అప్పగించాలని, కీలకమైన రికార్డులు, ఆస్తులను సీజ్‌చేసి అక్కడే భద్రత పరచాలని ఆదేశించారు. దీంతో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ కొత్తపల్లికి వెళ్లి మున్సిపాలిటీకి వెళ్లి రికార్డులను స్వాధీనం చేసుకొని ఆస్తులను సీజ్ చేశారు. ఆరురోజుల్లో అన్ని గ్రామాల రికార్డులను స్వాధీనం చేయనున్నారు. దీంతో ఇకపై విలీన గ్రామాల్లోని ప్రజలు నగరపాలక సంస్థ నుంచి సేవలు పొందాల్సి ఉంటుంది.

మోగిన నగారా

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ
- 10 వరకు నామినేషన్ల స్వీకరణ
- 11న పరిశీలన, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్ ... మార్చి 3న కౌంటింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్



2024, డిసెంబరు 30 వరకు
పట్టభద్రుల స్థానంలో మొత్తం ఓటర్లు
3,41,313
పురుషులు 2,18,060
మహిళలు 1,23,250
ట్రాన్స్ జెండర్లు 3
డిసెంబరు 31 నుంచి జనవరి 29 వరకు దరఖాస్తు చేసుకున్న వారు: 11,056

2024, డిసెంబరు 30 వరకు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం ఓటర్లు
25,921
పురుషులు 16,364
మహిళలు 9,557
డిసెంబరు 31 నుంచి జనవరి 29 వరకు దరఖాస్తు చేసుకున్న వారు: 2,148

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలు, ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, ఎ నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానున్నది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 13న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. మార్చి 3న కౌంటింగ్ ప్రారంభించి పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుంది. బుధవారం షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది.

● పట్టభద్రుల స్థానంలో 3,41,313 ఓట్లు, టీచర్ల స్థానంలో 25,921 ఓటర్లు:

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్ , సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలు, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లిలోని కొన్ని మండలాలకు చెందిన పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. 2024 డిసెంబరు 30 నాటికి ఈ నియోజకవర్గంలో 3,41,313 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 2,18,060 మంది పురుషులు, 1,23,250 మంది స్త్రీలు, ముగ్గురు థర్డ్‌జెండర్‌కు చెందినవారున్నారు. జనవరి 29వరకు 11,056 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ మార్చి 3న ప్రారంభం కానుండటంతో ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశమున్నది. ఫిబ్రవరి 3న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో 25,921 మంది గత డిసెంబరు 30 నాటికి ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 16,364 మంది పురుషులు కాగా, 9,557 మంది స్త్రీలు ఉన్నారు. జనవరి 29 వరకు 2,148 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు.

● ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, ప్రకటనలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను తొలగించాలన్నారు. బస్టాండ్, పబ్లిక్ ప్లేస్‌లలో ఉన్న హోర్డింగ్‌లు, బ్యానర్లు, స్టిక్కర్లు తీసివేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో ప్రజలను ప్రభావితం చేసే గోడ రాతలను చెరిపివేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయనాయకులకు సంబంధించిన విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. ప్రభుత్వ భవనాలను రాజకీయ సమావేశాలకు ఉపయోగించవద్దని, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పరమైన సమావేశాల్లో పాల్గొనవద్దని సూచించారు. సరైన పత్రాలు లేకుండా 50వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. ఆలయాలు, చర్చీలు, మసీదులు, ప్రార్థనా మందిరాలను ఎన్నికల ప్రచారానికి వినియోగించవద్దని, ప్రైవేట్ భవనాల యజమానుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించవద్దని కలెక్టర్ అన్నారు. అధికారుల అనుమతిలేకుండా పార్టీలుగానీ, అభ్యర్థిగానీ బహిరంగ సమావేశాలను నిర్వహించవద్దని, కొత్త పథకాల ప్రకటన, ప్రాజెక్టుల శంకుస్థాపన, కొత్త పనుల మంజూరు, ఆర్థిక గ్రాంట్లను ప్రకటించవద్దని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.



బాస్కెట్ బాల్‌లో తలపడుతున్న పోలీస్ జట్లు

క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు
- కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి
- కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు

7

నాలుగు రోజులైనా మిస్టరీ వీడని మమత కేసు
- 25న మంచిర్యాలలో కారెక్కి.. 27న గంగాధరలో శవమైన మమత

6



మమత మృతదేహం(ఫైల్)

కొలువుదీరిన 'ప్రత్యేక' అధికారులు

- కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్
- అధికారులతో సుదీర్ఘ సమీక్ష
- తొలిరోజే అక్షింతలు..

కరీంనగర్ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో 'ప్రత్యేక' పాలన మొదలైంది. చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం ఈనెల 26న ముగియడంతో అనదపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ ఆయా మున్సిపాలిటీల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 28న కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీ కాలం ముగిసింది. బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణితో కలిసి నగర పాలక సంస్థకు చేరుకున్న కలెక్టర్ పమేలా సత్పతికి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ నుంచి బాధ్యతలను స్వీకరించి రిజి స్టర్‌లో తొలిసంతకం చేశారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగరపాలక సంస్థకుచెందిన వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

● తీరు మార్చుకోవాలంటూ హెచ్చరికలు

నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ పమేలాసత్పతి నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ఆయా విభాగాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈసందర్భంగా ఆమె దాదాపు అన్ని విభాగాల అధికారులను తనదైనశైలిలో మందలించినట్లు తెలిసింది. ఇక్కడ ఏమి జరుగుతుందో అంతా తెలుసు... ఇప్పటికైనా పద్ధతి మార్చు కోవాలని ప్రజలకు మెరుగైన సేవలందించాలని హెచ్చ రించారు. ప్రజాపాలనలో మున్సిపల్‌లోని టౌన్‌ప్లానింగ్, సానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అనేక ఫిర్యాదులు



నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

అందుతున్నాయి... వాటిని పరిష్కరించడం లేదు.. ఇకపై దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదంటూ ఆదేశిం చారు. పారదర్శకంగా, జవాబుదారితనంతో విధులు సక్రమంగా నిర్వహించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్, ప్రత్యేకాధికారి పమేలా సత్పతి నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలని, గార్బేజ్ పాయింట్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. టీఎస్ బీపాస్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని, చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రజాపాలనలో తనకు దరఖాస్తులు వస్తున్నాయన్నారు. పనితీరును మార్చుకుని దరఖాస్తులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సివిల్ కోర్టు సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణాలను ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ఇవ్వాలని, జవాబుదారి తనంతో పనిచేయాలన్నారు. పన్నుల వసూళ్లలో లక్ష్యాలను చేరుకోవాలని, ఆస్తి పన్నులు, యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులతో ఆదాయం పెంచుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా అపార్టుమెంట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, భవన నిర్మాణం జరుగుతున్నపుడే అసెస్‌మెంట్ తప్పకుండా జనరేట్ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. టెండర్ అగ్రిమెంట్ ప్రకారం పనులు పూర్తి చేసేలా చూడాలని, పెండింగ్‌లో పెట్టిన కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. పనులు చేసిన వారికి ఆమేరకు బిల్స్ పేమెంట్ చేయాలన్నారు. గుడ్‌విల్ ఉన్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించేలా చర్యలు తీసుకుని పనులు పూర్తిచేయాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎస్ఈ రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థులపై కొనసాగుతున్న సస్పెన్స్

ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహులు ఈసారి ఓటర్ల నమోదుపై దృష్టి సారించారు. దీంతో 3.5 లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. బీజేపీ పట్టభద్రుల స్థానానికి సి అంజిరెడ్డిని, ఉపాధ్యాయుల స్థానానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమురయ్యను అభ్యర్థులుగా ప్రకటించింది.



కాంగ్రెస్ టికెట్ కోసం పలువురు ప్రయతిస్తున్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫసర్‌గా పని చేసి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణ మధ్య ప్రధానంగా పోటీ ఉంది. ఓటర్లలో 50 శాతం మంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారే ఉండడంతో ఇక్కడి అభ్యర్థిని బరిలోకి దింపితే బాగుంటుందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ చేయడంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు. ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నా.. అధిష్ఠానం ఎటూ తేల్చడం లేదు.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7

అపార్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి: డీఈవో

కరీంనగర్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయా లని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మండల విద్యాధికారులకు సూచించారు. కరీంనగర్‌లోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోలతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఈ నెలలో పదవీ విరమణ పొం దుతున్న కొత్తపల్లి ఎంఈవోను అజీమ్‌ను సన్మానించారు.

మెట్‌పల్లి కళాకారులకు

గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన పరేడ్‌లో శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన కళాకారులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. అందె భాస్కర్ సారథ్యంలో మెట్‌పల్లి చెందిన కళాకారులు దాసారపు భవాని, అంతడుపుల కోమల, మారముల్ల రజిత, దాసారపు స్వప్న, మిడిదొడ్డి రజిత జనవరి 5న ఢిల్లీకి వెళ్లారు. అప్పటి నుంచి రిహార్సల్స్‌లో పాల్గొని పరేడ్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐదు వేల మంది కళాకారులు 'జయతి జయ మం భారతం' అనే గీతంపై ఒకే చోట ప్రదర్శన ఇచ్చారు. ఐదు వేల మంది కళాకారులు ఒకే చోట నిర్వహించిన ఈ ప్రదర్శనను ఓ రికార్డుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించారు . భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ అరుణిషె చావులా, సంగీత్ నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యాపురెచాకు ఈ రికార్డును అందజేశారు. అరుదైన రికార్డులో పాలుపం చుకున్న మెట్‌పల్లి కళాకారులను కరీంనగర్ జిల్లా అధికార యంత్రాంగం, కళాకారులు అభినందించారు.



ఢిల్లీలో మెట్‌పల్లి కళాకారులు

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో బుధవారం జరిగింది. టూ టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతలవివేక్(21) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి రాజేశ్వరితో కలిసి బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో ఉంటున్నాడు. పదో తరగతి వరకు చదివిన వివేక్ మంచిర్యాల పట్టణంలోని ఓబట్టల దుకాణంలో పనిచేసేవాడు. ఇటీవల స్థానికంగా ఓయువతిని ప్రేమించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లి, అమ్మమ్మతో కలిసి టీవీ చూస్తూ పడుకున్నాడు. బుధవారం ఉదయం ఏడు గంటలకు వివేక్‌ను లేపుదామని వెళ్లగా రేకుల షెడ్డు పైకప్పుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓసీపీ-2 కార్మికుడి..

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే దాయక శ్రీనివాస్ (52) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓసిపి-2 స్టోర్స్‌లో పని చేసే శ్రీనివాస్ ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్సపొందినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం సెంటినరీకాలనీలోని ఎస్‌టిటూ 551నెంబరు క్వార్టర్ ఎదుట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

కోరుట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోహన్‌రావు పేట గ్రామంలోని చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతురాలి పుర్రెను కుక్కలు పీక్కుని వ్యవసాయ క్షేత్రంలో పడేయ డంతో బుధవారం ఘటన వెలుగు చూసింది. సంఘటన స్థలంను కోరుట్ల సీఐ సురేష్‌బాబు తన సిబ్బందితో పరిశీలించి గ్రామస్థుల సహ కారంతో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన వృద్ధురాలుగా గుర్తిం చారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుంట లింగవ్వ (87) మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 2వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లింది. తల్లి ఆచూకీ లభిచడం లేదని ఈ నెల 11వ తేదీన లింగవ్వ కుమారుడు రవి కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోరుట్ల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామంలోని చిలుక చెరువు ప్రాంతంలో ఓ వృద్ధురాలు తల ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో వృద్ధురాలి మృతదేహం గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఖననం చేశారు. 26 రోజులుగా మృతదేహం చెరువులో ఉండ డంతో పూర్తిగా కుళ్లిపోయి ఉంది. తల వేరయి ఒడ్డుకు చేరడంతో కుక్కలు ఎత్తుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు.

108వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడ్డ కిషన్

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : 108వాహనం ఢీకొని అసిస్టెంట్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మం డలంలోని జగ్గయ్యపల్లి అసిస్టెం ట్ లైన్‌మెన్ బి కిషన్ బుధవారం మండలంలోని అన్నారం గ్రామం లో విధులను నిర్వహించేందుకు మోటార్ సైకిల్‌పై వెల్లుతున్నాడు. అన్నారం నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న 108 వాహనం స్థానిక హన్మాన్ ఆలయం మూలమలుపు వద్ద కిషన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషన్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కి తరలించినట్లు విద్యుత్ సిబ్బందితెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి గాయాలైన సంఘటన మండలంలోని ఎరడపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన నరహరి ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఎరడపల్లి గ్రామానికి వచ్చి తిరిగి తన స్వగ్రామం వెళ్తున్నాడు. గ్రామశివారులో కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈప్రమాదంలో ఇంద్రసేనారెడ్డి కుడికాలు విరిగింది. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మగుడి వద్ద గంజాయి అమ్ముతూ పట్టు బడిన ముగ్గురు వ్యక్తులపై కేసునమోదుచేశారు. గ్రామంలోని ఆలయం వద్ద గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా సుల్తాన్‌బాద్‌కు చెందిన సుమంత్, పెద్దపల్లికి చెందిన పెంచాల సాయికృష్ణ, కల్వచర్లకు చెందిన చిప్పకుర్తి అజిత్ గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసుల రాకను గమనించి అజిత్ పరారు కాగా సుమంత్, సాయికృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద 30గ్రాముల గంజాయి, బైకు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

విద్యుత్ కంచె బిగించిన వ్యక్తిపై కేసు

కథలాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులోని అడవుల్లో విద్యుత్ కంచె అమర్చి అడవి జంతువుల మృతికి కారకుడైన అపావత్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్‌అధికారి సురేశ్ తెలిపారు. బుధవారం సంఘటనా స్థలం పరిశీలించి వెటర్నరీ వైద్యులతో పంచనామా నిర్వహించారు. అనం తరం తిరుపతిని అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాల యంకు తరలించారు. అడవి జంతువులకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈసందర్భంగా బీట్‌అధికారులు శివరాజ్, శ్రావణ్, సాయిరాం ఉన్నారు.

అదనపు వరకట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం తన భర్తనిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఓ వివాహిత ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీస్‌లు కేసునమోదుచేశారు. జమ్మికుంటకు చెందిన మాడుగుల సంధ్య, మండలంలోని మాచనపల్లికి చెందిన మాడుగుల కళ్యాణ్ చక్రవర్తికి 2014లో కట్న కానుకలు ఇచ్చి పెద్దలు ఘనంగా వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలు వారి కాపురం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. కొంత కాలంగా అదనపు వరకట్నం తేవాలంటూ భర్త వేదింపులకు గురి చేస్తున్నాడని సంధ్య పేర్కొంది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళ్యాణ్ చక్రవర్తిపై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు: బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం లోని పలుతండాల్లో ఎక్సైజ్‌అధికారులు బుధవారం దాడులు నిర్వహిం చారు. 400లీటర్ల బెల్లంపానకం ధ్వంసంచేసి, ఏడు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మపల్లి దేవునితండా వట్టిమల్ల, బావుసాయిపేట, కమ్మరిపేట తండాల్లో గుడుంబాను తయారుచేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బెల్లంతో చేసిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదుచేసి 8మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ఎస్సైలు శైలజ, ప్రణీత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగవైకల్యం

- 'కుష్టు'ను అరికట్టేందుకు లక్షణాలు గుర్తించి మందుల పంపిణీ
- నేడు కుష్టు నివారణ దినం
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



(సుభాష్‌నగర్/సిరిసిల్ల, ఆంధ్రజ్యోతి) కుష్టు.. ప్రాణాంతకమైన వ్యాధి కాదు.. అయినా నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారి. గతంతో పోల్చుకుంటే వ్యాధి తీవ్రత తగ్గి పోయినా.. ఇటీవల పెరుగుతున్నట్లు అంచనా వేసిన వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక సర్వేను చేస్తోంది. ప్రతి సంవత్సరం జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపుతున్నారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి సంవత్సరం వైద్య ఆరోగ్య శాఖ సర్వేలు చేస్తున్నారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు చేస్తున్నారు. కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుంది. ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టడం సులువు అవుతుందని భావిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్థులను గుర్తించే దిశగా ఇంటింటి సర్వేలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 మందిలో కుష్టు వ్యాధిని నిర్ధారించి చికిత్సను అంది స్తున్నారు.శాశ్వత అంగవైకల్యానికి గురికాకుండా అవసర మైన వారికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్సలు కూడా చేయి స్తున్నారు. శస్త్ర చికిత్సల అనంతరం వారికి పౌష్టికా హారం, ఇతర అవసరాలకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఫించన్లతో పాటు ఎంసీఆర్ చెప్పులు, మందుల కిట్లు అందిస్తున్నారు.

● కారణాలు.. లక్షణాలు

కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియమ్‌లేప్రే బాక్టీరియా వల్ల వస్తుంది. ఒకరి నుంచి ఒకరికి అంటుకోదు. వ్యాధిక్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రెండు నుంచి ఏడు రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడు తాయి. ఈ వ్యాధి వల్ల చర్మం, మ్యూకస్ మెంబ్రేన్ నరాలు వ్యాధికి గురవుతాయి. రోగ నిరోధకశక్తిని బట్టి లక్షణాలు మారుతుంటాయి.

రోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉండడం వల్ల దుమ్ముధూళి, ఊపిరి ద్వారా లోపలికి చేరుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. జబ్బును చాలా ముందుగా తేలికగానే తెలుసుకోవచ్చు. రంగు తగ్గిన మచ్చలు, చుట్టూ ఉన్న చర్మంతో పోలిస్తే మచ్చలు పాలిపోయినట్లు ఉంటాయి. మచ్చలు గుండ్రటి ఆకారంలో ఉండి వేడి, నొప్పి, స్పర్శ తెలియదు. ప్రధానంగా స్పర్శ జ్ఞానం కనిపించదు. చర్మం మీద మచ్చలు ప్రాంతానికి వచ్చే నాడులు వాపు తేలడం, మోకాలి వెలుపల పక్కన, మోచేయి లోతట్టున, మెడలోను లావెక్కిన నాడులు తెలుస్తాయి. నాడులు వాచడం జరుగుతుంది. నొప్పి, దురద, పుండ్లు వచ్చి మానకపోవడం, మొఖం మీద చర్మం మందంగా తేలి ఉండడం, కనుబొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం, పాదాలు, చేతులు శక్తిహీనమై వంకరలు తిరుగు తుంటాయి. తెల్లమచ్చలు ఉన్నచోట స్కిన్ క్లిప్ పరీక్ష చేసి క్రిములను గుర్తించి వైద్యాన్ని అందిస్తారు. కుష్టు లక్షణాలు ఉన్నావారు కంటి విషయంలోనూ, అవయ వాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సురక్షితమైన మందులను అందిస్తున్నారు.

సకాలంలో గుర్తిస్తే తగ్గించుకోవచ్చు..



- డాక్టర్ రజిత, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యాధికారి

కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చు. వ్యాధి లక్షణాలను గుర్తించి వారికి మందులు అందించడానికి సర్వేలు నిర్వహిస్తున్నాం. కొంత మంది శరీరంపై ఏర్పడే మచ్చలపై నిర్లక్ష్యం చేస్తున్నారు. వీరిలో అవగాహన కల్పించడానికి కుష్టు వ్యాధి నివారణకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు...

- డాక్టర్ అనిత, రాజన్న సిరిసిల్ల జిలా ప్రోగ్రాం అధికారి

జనవరి 30న కుష్టు నివారణ దినోత్సవం నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో వ్యాధిపై అవగాహన కల్పిస్తాం. ప్రజల్లో ఎవరికైనా ఏమైనా మచ్చలు ఉంటే ఆశా కార్యకర్తకు, ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తాం.



అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం...

- డాక్టర్ సుధారాజేంద్ర, కరీంనగర్ జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి



కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా బుధ వారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. 'కలిసి అవగాహన పెంచుకుం దాం-అపోహలను తొలగించు కుందాం'.. అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి


నవీన్ (ఫైల్)

రాయికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తన వ్యవ సాయ భూమిలో పొలం దున్నుతుండగా ప్రమా దవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువరైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దం నవీన్‌రెడ్డి (27) అనే యువ రైతు తన కేజీవీల్ ట్రాక్టర్‌ను తీసు కువెళ్లి రామాజీపేట- కుమ్మరి పెల్లి గ్రామాల మధ్యగలతన భూమిలో బుధవారం వరినాట్ల కోసం దున్ను తుండగా ట్రాక్టర్ బురదలో దిగబడిం ది. ట్రాక్టర్ నుంచి కేజీవీల్ తొలగించే క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడి నవీన్ మీద పడింది. దీంతో బురదలో కూరుకుపోయిన నవీన్ ఊపిరాడక సంఘటనా స్థలంలోనే మృతి చెందా డు. గమనించిన స్థాని కులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్ కింద నుంచి నవీ న్ మృతదేహాన్ని బయ టకు తీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జగి త్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. నవీన్‌కు భార్య, ఐదేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. నవీన్ తండ్రి ఇటీవల మృతి చెంద డంతో ఇంటికి పెద్ద దిక్కుగా ఉండ గా, అతని మృతితో కుటుంబం కన్నీరుమున్నీరవుతుంది. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

అనుపురంలో శివలింగం మాయం

వేములవాడ టౌన్, జనవరి29 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండలం అను పురం ఆర్అండ్ఆర్ కాలనీలో ప్రతిష్ఠించిన శివలింగాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. మాఘ అమావాస్యను పురస్కరించుకుని బుధ వారం పూజలు నిర్వహించేందుకు వెళ్లిన గ్రామస్థులు ఆలయంలో శివలింగం లేకపోవడం గుర్తించి పోలీసులకు సమా చారం అందించారు. దీంతో బీజేపీ నాయకుడు ఎర్రం మహేష్ ఆధ్వర్యంలో వెంటనే పోలీసుల సమక్షంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాన్ని అపహరించిన వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

గడ్డంపల్లెలో తాళం వేసిన ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుం దిల్ల గ్రామపరిధిలోని గడ్డంపల్లె గడ్డం రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని రాజయ్య అనారోగ్యం బారిన పడడంతో మూడురోజుల క్రితం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి తాళాలుపగులగొట్టి ఉండడాన్ని గమనించి గోదావరిఖని టూటౌన్ పోలీసు లకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రసాద రావు చోరీ జరిగిన తీరును గమనించి, రాజయ్య కుటుంబ సభ్యుల నుండి అపహరణకు గురైన సొత్తు వివరాలను తెలుసుకున్నారు. 100తులాల వెండి, తులం బంగారు ఆభరణం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్టు బాధితులు పోలీసులకు తెలిపారు.

దైవదర్శనానికి వెళుతూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు సిద్దిపేట వాసులు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం


కల్వర్టును ఢీ కొన్న కారు


జనార్దన్


ఆకుల కనుకయ్య, ఆకుల తార

సుల్తానాబాద్ , జనవరి 29: (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాలు దైవ దర్శనం కోసం బయలుదేరగా రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు వారిని కబళించింది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయ దర్శనానికి కారులో బయలుదేరగా పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో కారు కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట శ్రీనగర్ కాలనీకి చెందిన ఆకుల కనుకయ్య (60) ఆయన భార్య ఆకుల తార (50)తో పాటు వారి కుమారుడు ఆకుల శ్రీనివాస్, వియ్యంకుడు జంగిటి జనార్దన్ (45) ఆయన భార్య రమాదేవి, వీరి కుమారుడు జంగిటి మనోజ్‌కుమార్‌తోపాటు ఆకుల మాన్విత, ఆకుల ఆర్యన్‌లు డ్రైవర్‌తో కలిపి తొమ్మిది మంది కారులో బుధవారం తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో దైవదర్శనం కోసం బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారి పై కల్వర్టును ఢీకొంది. వేగంగా వస్తున్న కారు కల్వర్టు గోడను ఢీ కొనడంతో కారు ముందు భాగంగా నుజ్జు నుజ్జు అయింది. కారు ముందు సీట్లలో కూర్చున్న ఆకుల కనుకయ్య, తార దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జంగిటి జనార్దన్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆకుల శ్రీనివాస్, రమాదేవి, ఆర్యన్, మాన్విత, మనోజ్‌కుమార్‌తో పాటు డ్రైవర్ వై బాల్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

నాలుగురోజులైనా మిస్టరీ వీడని మమత కేసు

● 25న మంచిర్యాలలో కారెక్కి.. 27న గంగాధరలో శవమైన మమత


మమతతో కొడుకు ధృవన్(ఫైల్)

గంగాధర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమత(30) హత్యకేసు మిస్టరీ నాలుగు రోజులైనా వీడలేదు. మమతది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం. భర్తతో గొడవపడిన ఆమె నాలుగు నెలల క్రితం మంచిర్యాలలోని బంధువుల ఇంటికివచ్చింది. ఈనెల 25న ఆమె నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కొడుకును తీసుకుని కారులో ఎక్కిన మమత 27న గంగాధర మండలం కురిక్యాల వరదకాలువ సమీపంలో శవమై కనిపించింది. గంగాధర పోలీ సులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనానికి కుమరం భీం ఆసిఫాబాద్‌లోని తల్లిదండ్రులు గంగాధర పోలీ సులకు తమ కూతురేనని సమాచారం అందిం చారు. ఐదేళ్లకింద భరత్ అనే వ్యక్తినిప్రేమపెళ్లి చేసుకోగా వారికి కుమారుడు ధృవన్(4) ఉన్నాడు. అయితే భార్యభర్తల మధ్య మనస్ప ర్థలతో మమత నాలుగు నెలలుగా తల్లిగా రింట్లో ఉంటోంది. ఈనెల 25న పెంచికల్‌పేట తల్లిగారింట్లో నుంచి నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కుమారుడిని తీసుకుని కారులో ఎక్కినట్లు సీసీ పుటేజీల్లో రికార్డైంది. 27న గంగాధర మండలంలో మమత శవమై కనిపించింది. అయితే మమతను చున్నీతో హత్య చేయగా నాలుగు రోజులైనా కుమారుడి ఆచూకీ లభ్యం కాలేదు. మమతను కారులో తీసుకొచ్చింది ఎవరు.. అక్కడే హత్యచేసి గంగాధరలో పడేశారా లేక ఇక్కడే హత్య చేశారానేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. మార్చురీలో ఉన్న మమత మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు, భర్త గుర్తించారు. అనంతరం మమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు. ప్రస్తుతం ఈ కేసు గంగాధర పోలీసులకు సవాలుగా మారింది. కారు ఆచూకీ కోసం ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో పలు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఎవ్వరు హత్య చేశారు, హత్యలో ఎంతమంది పాల్గొన్నది, కారు లభిస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసుల భావిస్తున్నారు.

కాసిపేటలో ముగిసిన మమత అంత్యక్రియలు..

కాసిపేట: జగిత్యాల జిల్లా గంగాధర మండలం కుడిక్యాల వరద కాలువసమీపంలో అనుమానాస్పదంగా మృతిచెందిన మేడ మమత(30) అంత్యక్రియలు బుధవారం మంచిర్యాల జిల్లా కాసిపేట గ్రామంలో అత్తింటి వారు నిర్వహించారు.

ధృవన్ ఎక్కడ?

- సెల్‌ఫోనే కీలక ఆధారం..
- పోలీసుల అదుపులో అనుమానితులు?

కరీంనగర్‌క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమతతోపాటే ఉన్న కొడుకు జాడ మూడు రోజులైనా తెలియకుండా పోయింది. మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా ఆమెది హత్యగా భావిస్తున్నారు. కానీ ఆమెతో ఉన్న కొడుకు, సెల్‌ఫోన్‌లు ఎక్కడ ఉన్నాయనేది తెలిస్తే మమత మృతికి కార ణాలు వెల్లడయ్యే అవకాశముంది. మమత వెళ్లిన కారు ఎవరిది? కారులో వచ్చినవారు మమతకు పరిచయస్తులేనా? లేదా మాయమాటలు చెప్పి తీసుకుపోయారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫోన్‌మాట్లాడుకుంటూ వెళ్లిన మమత దారిలోనే కారులో ఎక్కి వెళ్లటం చూస్తే కారులో వచ్చిన వ్యక్తులు ఆమెకు పరిచయస్తులేనని వెల్లడవుతోంది. మమత అనుమానా స్పదస్థితిలో శవమై కనిపించడం, ఆమె కొడుకు జాడకోసం పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మమత మృతి మిస్టరీని ఛేదించేందుకు 4స్పెషల్ పోలీసుటీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒకటీం మంచిర్యాల నుంచి గంగాధర వరకు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తుండగా మరోటీం సెల్‌ఫోన్ టవర్‌డంపు ఆధారంగా అనుమానిత ఫోన్‌కాల్స్‌ను పరిశీలిస్తూ మిస్టరీని ఛేదించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మరో వైపున అదృశ్యమైన ధృవన్ కోసం పోలీసులు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మమత కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, ఆమె భర్త, బంధువులను ఇప్పటికే విచారించిన పోలీసులు మరికొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ధృవన్‌ను క్షేమంగా పట్టుకోవటమే ప్రధానధ్యేయంగా పోలీసులు అప్రమత్తంగా ఏ చిన్న ఆధారం, సమాచా రాన్ని కూడా వదిలి పెట్టకుండా నిశితంగా పరిశీలిస్తూ ఉన్నతాధికారుల సూచనలతో ముందుకుసాగుతున్నారు.

దొంగతనానికి వచ్చి.. సీసీ కెమెరాకు చిక్కి..

- నిందితుడిని బంధించిన కాలనీవాసులు..
- పోలీసులకు అప్పగింత


చోరీకి యత్నించిన దొంగ

వేములవాడ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీకి యత్నించిన ఓ దొంగ సీసీ కెమెరాకు చిక్కాడు. దీంతో స్థానికులకు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వేములవాడ పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక మోచివీధిలో బుధవారం తెల్లవారు జామున దొంగతనం కోసం వచ్చిన ఓ వ్యక్తి ముందుగా రెండు ఇళ్లలో చొరబడ్డాడు. అదేక్రమంలో మూడో ఇంటికి వెళ్లి పైఅంతస్తులోకి ప్రవేశించి అందిన కాడికి కాజేశాడు. అయితే గోడ దూకుతున్న శబ్దం రావడంతో ఇంటి యజమానికి మెలుకువవచ్చి అనుమానంతో సీసీ కెమెరాలు పరిశీలించగా దొంగ ఇంటిలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో దొంగపక్కనే ఉన్న ఇంటిలోకి దూకడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి అప్రమత్తం చేశాడు. వెంటనే వాళ్ల తేరుకొని చుట్టుపక్కల వారిని లేపడంతో దొంగను పట్టుకొని బంధించి పోలీసులకు అప్పగించారు. సీసీకెమెరాలో తన ముఖం కనబడకుండా టవల్ కప్పుకోవడంతోపాటు తలుపులు ఇతర వస్తువులపై వేలిముద్రలు పడకుండా గ్లవ్స్ ధరించడం గమనార్హం. దొంగతనం చేసే క్రమంలో కొంత నగదుతో పాటు వెండిని కూడా చోరీచేయగా ప్రస్తుతం వేములవాడ పట్టణపోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దొంగతనంపటనలో అనుమానితుడిని విచారిస్తున్నామని సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న వ్యక్తితోపాటు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులిద్దరిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ శవారులోని మానేరు వాగునుంచి టిప్పర్ ద్వారా పాక చంద్రమౌళి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణాచేస్తుండగా వీడియోలుతీసి రూ.10వేలుఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించా మని ఆయన తెలిపారు. ఈ కేసులోటిప్పర్, లారీ, కారును సీజ్ చేశామన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట వద్ద కలప లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసునమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్‌లో బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కామారెడ్డికి చెందిన పెంగర్లరాజు(30) చీకోడు గ్రామంలో నివసిస్తున్నాడు. కాగాపనిమీద ముస్తాబాద్ వచ్చి వెళ్తుండగా నామాపూర్ శివారులో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య ఉమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థులపై కొనసాగుతున్న సస్పెన్స్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల హడావుడి మొదలైంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలా బాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఆయా రాజకీయపార్టీల్లోని ఆశావహులు నాలుగు నెలల క్రితం నుంచే ఓటర్లను చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 అసెంబ్లీ స్థానాలు, ఆరు పార్లమెంట్ స్థానాల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఓటు చేయనున్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. మేధావి వర్గంగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు ప్రజాభిప్రాయానికి ప్రతీకగా నిలిచింది. తమ భవిష్యత్ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపుపై ఆయా పార్టీలు ప్రత్యేక దృష్టిసారించనున్నాయి. ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని మొదటి నుంచే తెలిసిన నేపథ్యంలో నాలుగు నెలల క్రితం నుంచే ఆయా పార్టీల నుంచి పోటీచేసే ఆశావహులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పోటాపోటీగా చేపట్టారు. నాలుగు జిల్లాల్లో వారు విస్తృతంగా పర్యటించి ఓటర్లను చేర్పించడమే కాకుండా తామే అభ్యర్థిగా ప్రచారం చేసుకొని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. అధికార కాంగ్రెస్ నుంచి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణతోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. ఎంఐఎం రాష్ట్ర నాయకుడు డాక్టర్ బీఎన్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగాచెందిన అంజిరెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. వీరందరూ ముమ్మరంగా ఓటర్లను నమోదు చేయిస్తూ ముందస్తు ప్రచారాలను నిర్వహించారు. ఈ కారణంగానే ఓటర్ల సంఖ్య గతంలో ఎన్నడూ లేని విధంగా 3.5 లక్షలకు చేరింది.

● కమలంలో కదనోత్సాహం...



పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కదనోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పట్టభద్రుల స్థానానికి మెదక్ జిల్లాకు చెందిన సి అంజిరెడ్డిని, ఉపాధ్యాయస్థానానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమురయ్యను అభ్యర్థులుగా ప్రకటించింది. 20 రోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థులకు మద్దతుగా పార్టీశ్రేణులు, నేతలను సమాయత్తం చేయడంతోపాటు బాధ్యతలను అప్పగించింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కూడా ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించి, ఖరారు చేశారు. పట్టభద్రుల స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేసిన అంజిరెడ్డి భార్య గోదావరి ప్రస్తుతం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్య హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహకుడు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి ఆసక్తి చూపించి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. వీరికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అండదండలు ఉన్నాయని, ఆ కారణంగానే వారు అభ్యర్థులుగా తెరపైకి వచ్చారని ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల స్థానానికి టికెట్ ఆశించిన సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి పార్టీ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారిద్దరు బాహాటంగానే తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. సుగుణాకర్‌రావు ఇప్పటికీ ఎన్నికల బరిలో ఉండే ఆలోచనలో ఉన్నట్లుగానే ప్రచారం జరుగుతున్నది.

● తేలని కాంగ్రెస్ అభ్యర్థి



అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జనభర్జన పడుతోంది. టీపీసీసీ స్థాయిలో రెండుసార్లు చర్చలు జరిగినా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి నాయకులతో చర్చించినా అభ్యర్థి ఎవరన్నది తేలలేదు. ప్రధానంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పోటీలో ఉన్నారు. వీరిలో మెజార్టీ నేతలు నరేందర్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నారని, నాలుగు జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉన్నా ఓటర్లలో 50 శాతం కరీంనగర్‌జిల్లాకు చెందినవారే ఉన్నారు. దీంతో ఇక్కడి అభ్యర్థినే పోటీలోకి దింపితే బాగుంటుందనే అభిప్రాయాన్ని ఉమ్మడి జిల్లా నేతలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్ఠానం మాత్రం ఇప్పటికీ ఈ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

● సందిగ్ధంలో బీఆర్ఎస్



ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల విషయంలో స్తబ్ధంగా ఉంది. ఆ పార్టీకి చెందిన రవీందర్‌సింగ్, బీఎన్‌రావు, యాదగిరి శేఖర్‌రావు టికెట్ ఆశించి నాలుగు నెలలుగా ప్రచారం చేసుకుంటున్నా పార్టీ మాత్రం ఇప్పటి వరకు జిల్లాస్థాయిలోగానీ, రాష్ట్రస్థాయిలోగానీ ఈ ఎన్నికల విషయంలో ఎలాంటి సమావేశాన్ని నిర్వహించలేదు. దీంతో ఈ ఎన్నికల్లో పార్టీ అధికారికంగా అభ్యర్థిని నిలుపక పోవచ్చని అభిప్రాయం నెలకొన్నది. అధిష్ఠానం విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాము మాత్రం పోటీలో ఉంటామంటూ నేతలు సోషల్ మీడియా ద్వారా ఇతరత్రా ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. యాదగిరి శేఖర్‌రావు తాను ఇండిపెండెంట్‌గా బరిలో ఉండనున్నట్లు ప్రకటించగా కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేస్తే పార్టీ పేరిట లేకపోతే ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటానని ప్రకటించారు. బీఎన్ రావు కూడా అదే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు మార్చి 3 నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండడంతో అభ్యర్థుల విషయంలో ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రకటన చేస్తాయని భావిస్తున్నారు.

రియాద్‌లో గ్లోబల్ లేబర్ మార్కెట్ సదస్సు

● హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు


రియాద్ సదస్సుకు హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు భీంరెడ్డి, చేతన తదితరులు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న గ్లోబల్‌లేబర్ మార్కెట్‌సదస్సు బుధవారం ప్రారంభమైంది. 45దేశాల కార్మిక మంత్రులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, 200 మంది వక్తలు, 100కు పైగా దేశాలనుంచి సుమారు 5వేలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) జాతీయఉపాధ్యక్షుడు రామచంద్రకుంతియా, తెలంగాణకు చెందిన వలస కార్మికసంఘ నాయకుడు మంద భీంరెడ్డి, రియాద్‌లో నివసిస్తున్న ఏపీకిచెందిన సామాజిక సేవకురాలు చేతన ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రభుత్వ, ప్రైవేటు రంగం, అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రతినిధుల మధ్య సమావేశాలు జరిపారు. కీలకమైన లేబర్ మార్కెట్ సవాళ్లను పరిష్కరించడం, వినూత్న పరిష్కారాలు, ఉత్తమ పద్ధతులు, ప్రపంచ అనుభవాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చెగ్యాం విద్యార్థులు


లాస్య, ఉదయశ్రీ, అమరేందర్

వెల్గటూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ప్రభాకర్, పీడీ మహేష్ తెలిపారు. నవంబరు 18న పెద్దపల్లిలో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 14 బాల బాలికల విభాగంలో సందవేని మధుశ్రీ, కూనారపు లాస్య, సందవేని అమరేందర్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుండి 31 వరకు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొననున్నారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మధుశ్రీ, లాస్య, అమరేంధర్‌లను ఎంఈవో ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామల కవిత, పీడీ మహేష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మౌని అమవాస్య పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రివరకు భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

కండ్లపల్లిలో అరుదైన శిల్పాలు

● పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

బీర్‌పూర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లిలో అరుదైన 8వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు వేరు వేరు కాలాలకు చెందిన అపురూప శిల్పాలు వెలుగుచూశాయి. విషయం తెలుసుకున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ బృందం సభ్యులు బుధవారం కండ్లపల్లి గ్రామానికి వెళ్లి శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండ్లపెల్లి గ్రామంలో గుర్తించినశిల్పాలు వెయ్యేళ్ల చరిత్రగల శిల్పాలని, జైనం, శైవం, వైష్ణవం శిల్పాలని అన్నారు. వాటి నమునాలు చూస్తే 8వ శతాబ్దం నుంచి 18వశతాబ్దం వరకు వేర్వేరు కాలాలకు చెందిన శిల్పాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు వొద్దిపర్తి మధుకుమార్, చిట్నేని విజయ్ కుమార్, గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలోని పలు ప్రదేశాలను పరిశీలించి శిల్పాలను గుర్తించారు. గుర్తించిన శిల్పాలలో రాష్ట్రకూటశైలి జైనతీర్థంకరుడు రుషభుని ధ్యానాసన శిల్పం,మరి రెండు వృషభలాంఛనాలతో రుషభుని శిల్పస్తంబాలు, వర్ధమహావీరుని అధిష్ఠానపీఠం, జైనబసది పూర్ణకలశం, 14, 15వ శతాబ్దాల శైలిలో గణపతి, కేశవమూర్తులిద్దరు, కుబేరుడు, విష్ణుమూర్తి, మహిషాసురమర్దని, నాగదేవత, 17,18వ శతాబ్దల శైలిలోచెక్కిన లోహకారుల దేవత మమ్మాయి శిల్పాలు, గుర్తించడానికి వీలు పడకుండా శిథిలమైన రెండు బహుభుజుల దేవతల శిల్పాలు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని గంగాధరి కోటయ్య ఇంటివద్ద జైన తీర్థంకరుని శిల్పంతో శాసనస్తంభం బయటపడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుతమైన వారసత్వ సంపదను పరిరక్షించి బావితరాలకు మన ఘన చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ దిశలో చరిత్రను, చారిత్రక ప్రదేశాలను తెలంగాణ చరిత్ర బృందం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక విశేషాలని సరియైన నిర్ధారణతో ఆవిష్కరించినట్లు కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ శిల్పాల పరిశీలన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతం రమేష్ గౌడ్, గంగాధరి పూర్ణచందర్, వడ్లూరి రవి, కోట కిషన్ గౌడ్, గంగాధరి శంకర్ గౌడ్,పోతుగంటి శ్యాంసుందర్ గైడ్, అజ్మీర లక్ష్మన్, గంగాధరి గంగాధర్, కంది భీమన్న తదితరులు ఉన్నారు.


బయటపడ్డ పురాతన అపురూప శిల్పాలు


పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం

పంట పొలాల్లోకి భారీగా కెనాల్ నీరు


పొలాల్లో భారీగా చేరిన కెనాల్ నీరు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): మండలం అంబాలాపూర్ గ్రామ శివారులో కాకతీయ ప్రధానకాలువ నుంచి డీబీఎం-12 ఉపకాలువద్వారా నీరు అధికంగా వదలడంతో పంట పొలాలకు భారీగా నీరుచేరింది. దీంతో వరిపంటకు తీవ్రనష్టం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈసందర్భంగా బుధవారం వారు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పంటపొలాల్లోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి

చొప్పదండి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు రుక్మాపూర్‌సైనిక్‌స్కూల్ 12వతరగతివిద్యార్థి బలరాం ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్‌కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు

● సీపీ అభిషేక్ మొహంతి ● కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు


కబడ్డీలో తలపడుతున్న హైదరాబాద్ సిటీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ జట్లు


కబడ్డీలో తలపడుతున్న జోన్3 రాజన్న సిరిసిల్ల, బాసర మహిళా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్, సీటీసీ, అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న మూడో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను రెండో బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని, జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాపతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ ఐజీపీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందనారు. కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభంప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, కరీంనగర్ ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ప్రతిభ చాటుతున్న పోలీస్ క్రీడాకారులు..

మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు 29 క్రీడాంశాల్లో పాల్గొంటున్నారు. ఖో-ఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగ, జిమ్నాస్టిక్స్ రెజ్లింగ్, లాన్ టెన్నీస్, టేబుల్ టెన్నీస్, సైక్లింగ్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాటర్ స్పోర్ట్స్, సెపక్ తక్రా, షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు

జాతీయస్థాయిలో సత్తాచాటాలి: ఐజీ రమేష్ రెడ్డి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఐజీ రమేష్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్‌మీట్‌లో తెలంగాణ రాష్ట్రరెజ్లర్లు సత్తాచాటాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(క్రీడలు) రమేష్ రెడ్డి అన్నారు. 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో భాగంగా బుధవారం ప్రాంతీయ క్రీడాపాఠశాలలో రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్‌లో అన్ని జోన్ల నుంచి పోలీసులు పాల్గొనడం సంతోషకరమన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలతోపాటు ఇంక్రిమెంట్లు అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోలీస్ క్రీడలు దోహదపడతాయన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ముందు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తే మన రాష్ట్ర క్రీడకారులు ఎక్కువ పతకాలు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, డీవైఎస్‌వో శ్రీనివాస్, రెజ్లింగ్ ఇన్‌చార్జి శేఖర్ రెడ్డి, గచ్చిబౌలి స్టేడియం ఏవోఆర్ఐ మధు, కోచ్‌లు జైపాల్, రాజు, వంశీకృష్ణ, శిరీష, పూర్ణసాయి, అఖిల్ పాల్గొన్నారు.

సదాశివపల్లి వద్ద జంక్షన్

ఏర్పాటు ఎప్పుడో?

- ప్రమాదాలకు నిలయంగా మారిన కూడలి
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారుల ప్రయాణం

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పాలక సంస్థ సదాశివపల్లి కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కూడలి నుంచి ప్రతి రోజు పెద్ద వాహనాలు వెళుతుంటాయి. వరంగల్‌కు, హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు కరంనగర్ శివారులోని మానేరు వంతెన మీదుగా వెళ్లేవి. దీంతో వాహనాల రద్దీ పెరిగి ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రమాదాలను తగ్గించేందుకు సదాశివపల్లి శివారులోని మానేరు వాగుపై తీగల వంతెనను నిర్మించారు. ఈ వంతెనను 20 నెలల క్రితం ప్రారంభించారు. తీగల వంతెన ఏర్పాటుతో నాలుగు కిలోమీటర్లు దూరం తగ్గడమే కాకుండా గోదావరిఖని ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది. అలుగునూర్ నుంచి, వరంగల్ నుంచి, తీగల వంతెన నుంచి వచ్చే రోడ్లు మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద కలుస్తాయి. ఈ మూడు రోడ్లు కలిసే కూడలి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి సూచికలు లేకపోవడంతో మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు స్పీడ్‌గా రావడంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తీగల వంతెనపై ప్రయాణించడం వల్ల దూరం తగ్గిందని సంబరపడ్డ వాహనదారులు ప్రమాదాలతో భయపడుతున్నారు. నగర పాలక సంస్థ పాలకులు తీగల వంతెన ను నుంచి సదాశివపల్లి బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సదాశివపల్లి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించకోవడం లేదు. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో ఇతర ప్రజాప్రతినిధులు సదాశివపల్లి కూడలిని సందర్శించి జంక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదుప. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, వాహనాదారులు కోరుతున్నారు.


ప్రమాదాలకు నిలయంగా మారిన సదాశివపల్లి కూడలి ఇదే

జంక్షన్ ఏర్పాటు చేయాలి..



– మాచర్ల కోటేశ్వర్, సదాశివపల్లి గ్రామస్థుడు

తీగల వంతెన నిర్మాణం అయిందని సంతోషపడ్డాం. సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు రావడంతో రోడ్డు దాటాలంటే భయపడుతున్నాం. ఎన్నికల్లో గెలిపిస్తే మూడు నెలల్లో జంక్షన్ ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఇప్పటికి నిర్మాణం ప్రారంభించలేదు. వెంటనే జంక్షన్ ఏర్పాటు చేయాలి.

భయంతో ప్రయాణిస్తున్నాం



– కముటం సంపత్, వాహనదారుడు

సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి వాహనాలు వేగంగా వస్తున్నాయి. దీంతో రోడ్డు దాటడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు దాటాలంటే భయమవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోండి

- మాజీ మేయర్ సునీల్‌రావు
- కలెక్టర్ పమేలా సత్పతికి వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): నగర పాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ పమేలాసత్పతికి మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లలో నగరపాలక సంస్థకు పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చామని, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. తెలంగాణలోనే ఇంత వేగంగా అభివృద్ధి చెందిన నగరం మరేదీ లేదన్నారు. నగరంలో తమ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలంలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. అందులో ఏమైనా అక్రమాలు, అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించామన్నారు. కాంగ్రెస్ శ్రేణులు మున్సిపల్ బోర్డును శుద్ధి చేయడం కాదని, ముందు వారి ఆత్మను శుద్ధి చేసుకుంటే బాగుంటుందని హితవు పలికారు.

ఆనాటి వాటాదారులు ఒక్కటయ్యారు

- సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ అవినీతి అక్రమాలను వాళ్లే స్వయంగా బట్టబయలు చేశారని, ఆనాటి వాటాదారులు బండి సంజయ్‌కుమార్, మాజీ మేయర్ సునీల్ రావు ఇప్పుడు ఒక్క పార్టీ వారయ్యారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. పదేళ్లు బీఆర్ఎస్, బీజేపీ దోపిడీకి పాల్పడ్డాయన్నారు. వారి చీకటి ఒప్పందంలో భాగమే బీజేపీలో సునీల్‌రావు చేరికన్నారు. సిటీ కాంగ్రెస్ ఎప్పుడో వారి చీకటి ఒప్పందాలను బయట పెట్టిందన్నారు. డంపింగ్ యార్డుకు రూ.16 కోట్లు కేటాయిస్తే 16 గంటలు కూడా పని చేయలేదన్నారు. ఆనాడు వాస్తవాలు మాట్లాడితే, బీఆర్ఎస్ కార్పొరేటర్లు సునీల్‌రావుకు మద్దతుగా తనపై విమర్శలు చేశారన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒప్పుకోవడం చూస్తే అవినీతి అక్రమాల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టమవుతోందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీతో గెలువబోతోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ నాయక్, తమ్మడి ఎజ్రా, గుండటి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి సత్యనారాయణరెడ్డి, వాడ వెంకటరెడ్డి, జీడీ రమేష్, కుర్ర పోచయ్య, దన్న సింగ్, అస్తపురం రమేష్, మహేష్, మెతుకు కాంతయ్యా, మేరాజ్, షైనషా, ఖారీ, బషీర్, ఖలీల్, జమీల్, అశ్రఫ్, ఇమ్రాన్, షబానా, కవిత, మహాలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకురాలిగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ మాలతి

కరీంనగర్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల ప్రిన్సిపల్ మాలతి మల్టీ జోన్ 3 పరిధిలో ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతిని సూపరింటెండెంట్ సురేష్ కుమార్, సీనియర్ అధ్యాపకులు ఎస్.పద్మజ, ఎర్రోజు వెంకటేశ్వర్లు సన్మానించారు.

పారమితలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం


కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భగత్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ స్కూల్‌లో విద్యార్థులు వీడ్కోలు (స్మృతి) సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజంలో ప్రత్యేక స్థానం ఏర్పర్చుకోవాలన్నారు. పారమితలో విద్యనభ్యసించిన విద్యార్థులు నైతిక విలువలను, స్వీయ క్రమ శిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, వినోద్‌రావు, రష్మిత, రాకేష్, అనూకర్‌రావు, వీయూఎం ప్రసాద్, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ, కో-ఆర్డినేటర్లు రవీంద్ర పాత్రో, భవానీ, సరిత, ప్రోగ్రాం ఇన్‌చార్జి పావని పాల్గొన్నారు.

మహాకుంభమేళ జలంతో బల్దియా బోర్డు శుద్ధి

కరీంనగర్ టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఐదేళ్ల అవినీతి రాజ్యమేలిందని, నిన్నటితో పాలకవర్గ పదవీకాలం ముగియడంతో మహాకుంభమేళ నీటితో నగరపాలక సంస్థ కార్యాలయ బోర్డును శుద్ధి చేశామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్ (మార్షల్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ మేయర్‌గా ఐదేళ్ల సునీల్ రావు పాలన అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. పాలకవర్గం పదవీకాలం ముగిసినందున అవినీతి కంపును కడిగివేశామని, వచ్చే ఎన్నికల్లో కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంక్ పీఏసీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి


విద్యార్థినికి గైడ్ అందజేస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్

సుభాష్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎంఐఎం కృషి చేస్తోందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్ అన్నారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్‌లోని ప్రభుత్వ ఉర్దుమీడియం పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సలారేమిల్లత్ ఆల్ ఇన్ వన్ 2025 గైడ్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సాలారే మిల్లత్‌తో పాటు అసదుద్దీన్ ఓవైసీ, శాసన సభాపక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉర్దూ మీడియం విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, నగర ప్రధానకార్యదర్శి బర్కత్‌అలీ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ధూపదీప నైవేద్యం అర్చకుల కృతజ్ఞతలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): వేతన బకాయిల విడుదలపై ధూప దీప నైవేద్య పథకం అర్చకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వేతన బకాయిలు విడుదల చేయడంతో బుధవారం కరీంనగర్‌లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ సహకారంతో, ధూపదీప నైవేద్యం(డీడీఎన్) అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ కృషి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వేంకటాద్రిస్వామి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం అధ్యక్షుడు మాధవాచారి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంతోష్ శాస్త్రి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథి శర్మ, కరీంనగర్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్యామసుందరాచార్యులు, శంకరయ్య, శివ ప్రసాద్, శేషాచార్యులు, కొండమాచార్యులు, రమేశ్, వేంకటరమణాచార్యులు ఉన్నారు.

● సంక్షిప్త సమాచారం..

శివరాత్రికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయంలో ఫిబ్రవరి 26న శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్, ఈవో కొన్న కాంతారెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం, మాసశివరాత్రి, ఆర్ద్ర నక్షత్రం రోజున ఉదయం 6 గంటల నుంచి 8 వరకు అంతరాలయ స్పర్శ దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

దుర్గాభవానీ ఆలయంలో శైశిర నవరాత్రోత్సవాలు

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గా భవానీ ఆలయంలో శైశిర నవరాతోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దుర్గా భవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వరశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళలక్ష్మణ్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు

భగత్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజరాజేశ్వర్ లయన్స్‌క్లబ్, భరత్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు ఎస్ఆర్ఆర్ కళాశాలలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ లిఫ్ట్ మిల్లర్స్ అసోసియేషన్

భగత్‌నగర్: కరీంనగర్ లిఫ్ట్ మిల్లర్స్ అసోసి యేషన్ ఏర్పాటు చేశారు. బుధవారం నగరంలోని ముకుంద లాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడారు. రాబోయే రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పోరాటాలు చేయనున్నట్లు చెప్పారు.

పాఠశాలల తనిఖీ

కరీంనగర్ రూరల్:మండలంలోని గోపాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాతవాహన ప్రైవేటు పాఠశాలను ఎంఈవో రవీందర్ బుధవారం తనిఖీ చేశారు.

సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా వాసుదేవరెడ్డి

భగత్‌నగర్: సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా కరీంనగర్ జిల్లా సీపీఎం కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభల్లో ఐదుగురు కమిషన్ సభ్యులను ఎన్నుకున్నారు.

మజ్దూర్ సంఘం కార్యవర్గం

భగత్‌నగర్: తెలంగాణ స్టేట్ కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శిగా కర్రకంటి సత్యం, కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా మొగిలిపాలెం తిరుపతి నియామకమయ్యారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధంగా ఉన్న సంఘ్ ద్వితీయ రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో నిర్వహించారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా రాణాప్రతాప్

సుభాష్‌నగర్: పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారిగా జిల్లా కేంద్రానికి చెందిన కుతాటి రాణాప్రతాప్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలీన సభలో ఆయనను ఎన్నుకున్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే బీజేపీలో చేరిక

కరీంనగర్ అర్బన్, సనవరి 29(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో భారీ అవినీతికి పాల్పడిన మేయర్ సునీల్‌రావు ఈడీ, సీబీఐ కేసుల నుంచి తప్పించుకునేందుకే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిన్నటి వరకు నగర మేయర్‌గా ఉన్న సునీల్‌రావు, బీఆర్ఎస్ నేత కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణల చేసుకోవడంతో వారి అవినీతి బట్టబయలైందన్నారు. అవినీతి నేతలను పార్టీలో చేర్చుకోవడం బీజేపీకి అజెండాగా మారిందని ఎద్దేవా చేశారు. సునీల్‌రావు అక్రమ ఆస్తులపై, నగరపాలక సంస్థలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతామన్నారు. వారి ఆస్తులపై సీబీసీఐడీ, డీజీ, హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు నిహాల్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ పాషా బాయ్, చాంద్ పాషా, సలీముద్దీన్, కలీం, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

కరీంనగర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇప్పించాలని కరీంనగర్ మండలంలో పని చేస్తున్న ఉపాధిహామీ సిబ్బంది కోరారు. బుధవారం ఎంపీడీవో సంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పథకాల్లో సెలవులు లేకుండా రాత్రింబవళ్లు పనిచేసినా గుర్తించడం లేదన్నారు. వేతనాలు అందక కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీవో శోభరాణి, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టండి

కరీంనగర్ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలని మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ (మార్షల్) డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని గతంలో ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారని, ఇప్పుడు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మేయర్ సునీల్‌రావు కోరుతున్నారని అన్నారు. అందరూ అవినీతి జరిగిందని ఒప్పుకుంటున్నందున అసలు అవినీతికిపాల్పడిందెవరో తేల్చాల్సిన బాధ్యత ను ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తీసుకోవాలని కోరారు. మేయర్ కాకముందు, అయినతర్వాత సునీల్‌రావు ఆస్తులను పరిశీలిస్తే అవినీతి ఎంత చేశాడో తెలుస్తుందన్నారు. ఆయన చేసిన అవినీతిపై ఇప్పటికే చాలా ఫిర్యాదులు చేశామని, త్వరలోనే సునీల్‌రావు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. అవినీతిపై విచారణ జరపాలంటూ కలెక్టర్‌ను సునీల్‌రావు కోరడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు.

కొనసాగుతున్న జర్నలిస్టుల నిరసన


హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

హుజూరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఇల్లు మాకు కావాలంటూ హుజూరాబాద్ జర్నలిస్టులు చేస్తున్న నిరసన కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. అనంతరం వివిధపార్టీల నాయకులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా జర్నలిస్టులు ఎంతో కష్టపడి సాధించుకున్న నివేషణస్థలాలను కాంగ్రెస్ పార్టీఅడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. జర్నలిస్టులసమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారికి అండగా ఉంటామన్నారు. సమస్యపై ప్రభుత్వం కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తునఆందోళనలు చేపడుతామన్నారు. తదనంతరం ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో-కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణ, జర్నలిస్టులు పిల్లల సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బేడ, బుడగ జంగం నాయకులు

రామడుగు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో బేడ,బుడ జంగం (ఎస్సీ) కుల ధ్రువీకరణపత్రాల విషయంలో తహసీల్దార్‌నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ బుధవారం జిల్లా కలెక్టర్‌ను బేడ, బుడగ జంగం నాయకులు కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలు తప్పసరి అయినప్పటికీ తహసీల్దార్ కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పురాణం రమేష్, విభూది రమేష్, గోపాల్, సంపత్ తదితరులు ఉన్నారు.

టీబీ నివారణకు అందుబాటులో ప్రభుత్వ వైద్యం

చిగురుమామిడి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): టీబీవ్యాధి నివారణకు ప్రభుత్వవైద్యం సిద్ధంగా ఉందని ఎంపీడీవో మధుసూదన్‌అన్నారు.. బుధవారం చిగురుమామిడి మండలపరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు టీబీ ఫ్రీ గ్రామపంచాయతీ కాన్సెప్ట్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అందరూ ఈ క్షయ వ్యాధిపై అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో మండలపరిషత్ సూపరింటెండెంట్ ఎండీ కాజా మొయినుద్దీన్, అన్నిగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో కొత్త ఆవిష్కరణలు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి):: మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో కొత్త ఆవిష్కరణలు వస్తున్నాయని, వాటిని తెలుసుకునేందుకు ఇంటర్నేషనల్ జర్నల్స్ చదవటం ఆవశ్యకమని ఎన్ఐటీ సూరత్‌అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కెకృష్ణకిషోర్ తెలిపారు. మండలంలోని సింగాపూర్‌గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అటల్‌ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ మూడోరోజుశిక్షణలో అధ్యాపకులకు మెకానికల్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం ఏవిధంగా వాడుతున్నారన్న దానిపై అవగాహన జరిగింది. కేయూలోని ఇంజనీరింగ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె అశోక్‌రెడ్డి నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ అంశం మీద శిక్షణ ఇచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


మానకొండూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్/మానకొండూర్/తిమ్మాపూర్/రామడుగు: జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో, మానకొండూరు, తిమ్మాపూర్, రామడుగు మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈసందర్భంగా హుజూరాబాద్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు మాట్లాడుతూ నక్సలైట్లకు మద్దతుగా పాటలు పాడిన గద్దర్‌కు పద్మశ్రీఅవార్డు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. దేశానికి వ్యతిరేకంగా నిరంతరం పనిచేసిన గద్దర్‌కు అవార్డులు ఎలా ఇస్తారని ప్రశ్నించిన బండి సంజయ్ మాటల్లో ఎలాంటి తప్పు లేదన్నారు. మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిందని కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడటం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల వేణు, గంగిశెట్టిరాజు, కొలిపాక శ్రీనివాస్, సుమన్, మానకొండూరులో మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి, మాజీ అధ్యక్షులు రాపాక ప్రవీణ్, వాసాల బాను చందర్, తిమ్మాపూర్‌లో మండల బీజేపీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు గడ్డం అరుణ్, కళ్యాణ్ చంద్ర, రామడుగు బీజేవైఎం మండలాధ్యక్షుడు దురిశెట్టి రమేష్, ఎడవెల్లి రాం, ఎడవెల్లి లక్ష్మణ్, దయ్యాల రాజు, బండారి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చొప్పదండి: గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు మొగిలి మహేష్, బీజేపీ జిల్లాకార్యదర్శి చేపూరి సత్యనారాయణ, సింగిరెడ్డి భూమిరెడ్డి, మొగిలి సారయ్య, మధుసూదన్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, శంకర్, మహేష్, రాజు, రమేష్ తెలిపారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అబ్బిడి తిరుపతి రెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, గుత్తికొండ రాంబాబు, మడ్డి శ్రీనివాస్, దుర్గయ్య, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వాణిదేవిని కలిసిన పీవీ సేవాసమితి సభ్యులు

హుజూరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌కు చెందిన పీవీ సేవాసమితి సభ్యులు బుధవారం ఎమ్మెల్సీ వాణిదేవిని హైదరాబాద్‌లో మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లో పీవీవిగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తమవంతు సహకారం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి అందజేత

హుజూరాబాద్‌రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలకు అదామా పెస్టిసైడ్స్ కంపెనీ సహకా రంతో ఎన్‌జీవో సంస్థ నాలుగు లక్షల విలువచేసే సామగ్రిని అందజే సింది. కార్యక్రమంలో కంపెనీసేల్స్ మేనేజర్ పాపు నాయుడు, ప్రధానో పాధ్యాయులు వీడెపు శ్రీనివాస్, అదామా కంపెనీ ప్రతినిధులు ప్రకాస్, తూముల చక్రధర్, రైతు డీపో మనోహర్, రైతులు పాల్గొన్నారు.


అదామా కంపెనీ సేల్స్ మేనేజర్‌ను సన్మానిస్తున్న గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల హెచ్‌ఎం

రెండో విడత దళితబంధు విడుదలపై హర్షం


హుజూరాబాద్‌లో సీఎం, మంత్రులు, ప్రణవ్ చిత్రపటానికి క్షీరాభిషేకంచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్/జమ్మికుంట/వీణవంక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రెండోవిడత దళితబంధు విడుదల చేయడంపై హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో, వీణవంకలో బుధవారం కాంగ్రెస్‌నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, వొడితెల ప్రణవ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చల్లూరి రాహుల్, ప్రతాపనాగరాజు, ఎండీ అఫ్సర్, రాజుబాబు, జమ్మికుంటలో జిల్లాయూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పర్లపల్లినాగరాజు, రమేష్, సాగర్, మహేష్,రమేష్, అనిల్,వీణవంకలో నాయకులు మహంకాళి రమేష్, గాజులకుమార్, అంబాలశంతన్, గాజులప్రవీన్, వడ్డేపల్లి అమోల్, కండేమహేందర్, గాజుల రాజేందర్, తదితరులున్నారు. వీణవంకలో జరిగినమరో కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుఎక్కటి రఘు పాల్‌రెడ్డి కాంగ్రెస్‌ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్: దళితబంధు రెండో విడత నిధుల విడుదలకు ప్రభుత్వం జీవోజారీ చేసిందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తూ దళితబంధు రెండో విడత నిధులను విడుదల చేయడానికి జీవోజారీ విడుదల చేసిందన్నారు. దళితుల పట్ల నిజమైన ప్రేమ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉంటుందని రుజువైందన్నారు.

గద్దర్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక,జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న గద్దర్‌జయంతి పురస్కరించుకొని చల్లూరు, మామిడాలపల్లి గ్రామాల్లో జరిగే సభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. సభనుపురస్కరించుకొని మల్లారెడ్డిపల్లి- అమ్మఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవం జరుగనుంది. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ పుల్లారెడ్డి, మాజీసర్పంచ్ మేకలఎల్లారెడ్డి, మాజీఎంపీటీసీ తాండ్రశంకర్, గూడెపుసమ్మయ్య, అమ్మఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న ఉన్నారు

గుమాస్తా సంఘం అధ్యక్షుడిగా రమేష్

జమ్మికుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట గుమాస్తాల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. గౌరవఅధ్యక్షుడి పొనగంటి మల్లయ్య, ముఖ్య సలహాదారుగా పోశాల వెంకన్న, అధ్యక్షుడిగా వీర్ల రమేష్, ఉపాధ్యాక్షుడిగా పొనగంటి సురేష్ కుమార్, ప్రధానకార్యదర్శిగా గుర్రం నవీన్‌కుమార్, కార్యదర్శిగా గజ్జిగోపి, కోశాధికారిగా ఎండీ సజ్జత్ పాషా, కార్యవర్గసభ్యులుగా మహేష్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

● అవీ.. ఇవీ

మానకొండూర్: మానకొండూర్‌లోని పల్లెమీద బస్టాండ్‌వద్ద మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపల్లి పోలు, కేంద్ర సంపత్, వాసాల బానుచందర్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ప్రధానమంత్రి కుసుమ్ కార్యక్రమంలో భాగంగా సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకోసం డీఆర్డీవో ఉప్పు ల శ్రీధర్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో బాసం మధుసూదన్ బుధవా రం స్థల పరిశీలన చేశారు.

చొప్పదండి: భారత సుస్థిర వ్యవసాయ సంస్థ(బీసీఐ), వరల్డ్‌వైడ్‌ఫండ్‌ఫర్ నేచర్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని చొప్పదండి రైతు వేదికలో నిర్వహించారు.కార్యక్రమంలో ఏడీ ప్రియదర్శిని, పీయుఎం నిఖిత, ఏపీయుఎంలు మాధవి, రామారావు, చొప్పదండి, జూలపల్లి మండలాలడీలర్లు,అధికారులు పాల్గొన్నారు.

-పట్టణ పరిధిలోని6వవార్డులో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. డ్రైయినేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు సరిగా లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

శంకరపట్నం: కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో సామాన్యప్రజల్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుం టోందని బీజేపీమండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో దర్నా నిర్వహించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలోని ప్రభుత్వ బాలురఉన్నతపాఠశాలలో డీటీ ఎఫ్ మండలకౌన్సిల్ సమావేశాన్ని బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షు డిగా బి వేణుమాధవ్, ప్రధానకార్యదర్శి వి రాజేందర్, ఉపాధ్యాక్షులుగా పి చంద్రశేఖర్, ఎల్ సంపత్, ఎస్ రాగిణి, కె వెంకటరెడ్డి, కార్యదర్శిగా టి హరీష్‌కుమార్, తదితరు లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ పాత గ్రామపంచాయతీలో డీఎల్‌పీవో శ్రీనివాస్ బుధవారం విచారణచేపట్టారు. గ్రామ పరిధిలో అభివృద్ధిపనుల్లో అవకతవకలు జరిగాయని రాజిరెడ్డి అనేవ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదుచేయగా డీఎల్పీవో విచారణచేశారు.